## క్లుప్తంగా

### పశు పోషణతో ఆర్థికాభివృద్ధి



వడ్లమూరులో పాడి రైతుకు మందులు అందజేస్తున్న సర్పంచ్ మంగాయమ్మ

**కపిలేశ్వరపురం:** పశుపోషణతో ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని వడ్లమూరు సర్పంచ్ చుండ్రు మంగాయమ్మ అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. పశువైద్యాధికారి వీవీ రమణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న శిబిరాల్లో పశువులకు నట్టల నివారణ, గర్భ కోశ వ్యాధులకు చికిత్సలు చేస్తున్నారన్నారు. కోళ్లకు టీకాలు వేస్తారన్నారు. పశువులకు మూడు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పలివెల మధు, సిబ్బంది పాల్గొన్నారు.

### అలరించిన లేగ దూడల ప్రదర్శన

**రాయవరం:** మండలంలోని చెల్లూరులో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లేగ దూడల ప్రదర్శన సోమవారం పశు పోషకులను ఆకట్టుకుంది. స్థానిక పశు వైద్యశాల ప్రాంగణంలో వైద్యాధికారి పి.విజయ్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాలిక రాఘవ అధ్యక్షతన జరిగిన సభలో రాయవరం ఏడీఏ అనిత మాట్లాడుతూ లేగ దూడలను సంరక్షించడం ద్వారా మేలైన పాల ఉత్పత్తులను సాధించుకోవచ్చునన్నారు. ప్రదర్శనలో ముత్యాల రామయ్య చౌదరి గేదె దూడకు ప్రథమ, ముత్యాల వీవీ సత్యనారాయణమూర్తి(పెదబాబు) ఆవు దూడకు ద్వితీయ, పంపన రాజేశ్వరరావు ఆవు దూడకు తృతీయ బహుమతులు దక్కాయి.

### పారిశుద్ధ్యం మెరుగుకు కృషి



కాలువగట్టు రోడ్డులో పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాణి, కౌన్సిలర్ నీలం దుర్గమ్మ

**మండపేట:** పట్టణంలోని 27, 28 వార్డుల్లో పారిశుద్ధ్య మెరుగుకు శానిటేషన్ అధికారులు కృషి చేస్తున్నారు. ఆ వార్డు కౌన్సిలర్లు నీలం దుర్గమ్మ, మొండి భవానీల సూచనల మేరకు చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఆదేశాలతో మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. రెండు వార్డులకు సంబంధించి గాంధీనగర్ రైతుబజార్, సైదిల్‌పేట వీధులను ఆనుకుని ఉన్న రామచంద్రుడు కాలువ గట్టు వెంబడి చెత్త, బిల్డింగ్ వ్యర్థాలు పేరుకు పోయాయని చెప్పడంతో సోమవారం జేసీబీ సాయంతో వాటి తొలగింపునకు చర్యలు చేపట్టారు. మట్టి దిబ్బలు, పిచ్చి మొక్కలు, ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. ఈ పనులను కౌన్సిలర్ నీలం దుర్గ, చైర్‌పర్సన్ రాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతే ధ్యేయంగా పని చేస్తున్నామని అన్నారు. వార్డుల్లోని నివాసితులు ఇళ్లల్లో చెత్తను డస్ట్‌బిన్ల ద్వారా తడి, పొడి చెత్తగా విడదీసి పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించాలని కోరారు. చైర్‌పర్సన్ వెంట వైఎస్సార్ సీపీ నాయకుడు మొండి మురళి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మేస్త్రీలు సందక ఉమా మహేశ్వరరావు, వెంకట్రావు పాల్గొన్నారు.

### 30 నుంచి నీలకంఠేశ్వరుని కల్యాణోత్సవాలు

**సఖినేటిపల్లి:** అంతర్వేది క్షేత్రంలో కొలువై ఉన్న పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్టు సదరు దేవస్థానం సోమవారం తెలిపింది. మహోత్సవాల్లో భాగంగా 30వ తేదీన అంకురార్పణ, 31వ తేదీన రాత్రి నంది వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం పేర్కొంది.

### కల్లుగీత కార్మికుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**ఆలమూరు:** స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆలమూరు, మండపేట రూరల్, టౌన్, కపిలేశ్వరపురం మండలాలకు సంబంధించి కల్లుగీత కార్మికులకు మూడు మద్యం దుకాణాలను కేటాయించినట్టు సీఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట మండలాలకు మూడు మద్యం దుకాణాలను ఒక్కొక్కటి చొప్పున శెట్టిబలిజ కులస్తులకు కేటాయించినట్టు తెలిపారు. ఈనెల 28 నుంచి వచ్చే నెల ఫిబ్రవరి ఐదో తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆరున దరఖాస్తులను పరిశీలించి, ఏడున అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో డ్రా తీయనున్నట్టు తెలిపారు. కల్లుగీత కార్మికుడు సంబంధిత కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, రూ.రెండు లక్షల నాన్ రిఫండబుల్ డీడీతో స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలని సీఐ నాగేశ్వరరావు కోరారు.

# ప్రయోగ పరీక్షలకు వేళాయె!

- ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సర్వం సిద్ధం
- ఫిబ్రవరి 10 నుంచి 20 వరకు నిర్వహణ
- రెండు విడతలుగా ఏర్పాట్లు
- రెండు నియోజకవర్గాల్లో 16 కేంద్రాలు
- విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న అధ్యాపకులు



అంగర శ్రీ సిద్ధార్థ కళాశాలలో విద్యార్థులకు భౌతిక శాస్త్ర ప్రయోగాన్ని వివరిస్తున్న అధ్యాపకుడు రాంబాబు

**కపిలేశ్వరపురం:** చదువంటే విన్నదాన్ని సమాధాన పత్రంపై రాసేది మాత్రమే కాదు. అధ్యాపకుడు చెప్పిన పాఠ్యాంశాన్ని గ్రంథాలయంలో మరింత విస్తృత అధ్యయనం చేసి, అధ్యయన అంశాలను సామాజిక పరిస్థితులతో జోడించి పరిశీలన చేయాలి. అలా పరిశీలించిన అంశాలను ప్రయోగాత్మకంగా విశ్లేషించి ఫలితాన్ని రాబట్టాలి. అలా విద్యార్థులను తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ఇంటర్మీడియట్‌లో ప్రాక్టికల్స్‌ను నిర్వహిస్తారు. ఎంతో ప్రాధాన్యత గల ఈ ప్రాక్టికల్స్‌ను వార్షిక థియరీ పరీక్షలకు ముందుగా ఏటా ఫిబ్రవరిలో నిర్వహిస్తారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు ఈ నెల 10 నుంచి 14 వరకూ మొదటి విడతలోనూ, 15 నుంచి 19 వరకూ రెండో విడతలోనూ ప్రాక్టికల్ పరీక్షలకు షెడ్యూల్ ఖరారు చేసింది.

**రెండు నియోజకవర్గాల్లో నిర్వహణ ఇలా..**

విద్యార్థుల సౌకర్యార్థం దాదాపుగా ప్రతి జూనియర్ కళాశాలను పరీక్షా కేంద్రంగా ఏర్పాటు చేశారు. మండపేటలో 6, కపిలేశ్వరపురం 1, రాయవరం 2, రామచంద్రపురం పట్టణంలో 5, రూరల్‌లో 1, కె.గంగవరంలో 1 మొత్తం 16 కళాశాలల్లో ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా నిర్వహణ తీరును ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకూ రెండు విడతలుగా పరీక్షలను నిర్వహించనున్నారు.

### డయాగ్రమ్‌లు సరిగ్గా వేయాలి



జువాలజీలో ప్రయోగ పరీక్ష మూడు భాగాలుగా ఉంటుంది. పటాన్ని గుర్తించి భాగాలను రాసినందుకు గానూ ఆరు మార్కులు, ప్రయోగాంశాలు చేసినందుకు ఐదు మార్కులు ఉంటాయి. ఇచ్చిన స్పెసిమెన్స్, స్లైడ్స్‌లను గుర్తించడం, వాటికి పటాలను గీయడం, వాటిలోని భాగాలను రాసినందుకు గానూ 14 మార్కులుంటాయి. రికార్డు రాసినందుకు 5 మార్కులు మొత్తం 30 మార్కులుంటాయి.

– వి.వీరలక్ష్మి, జువాలజీ అధ్యాపకురాలు, అంగర, కపిలేశ్వరపురం మండలం

### శాస్త్రీయతకు ప్రాధాన్యమివ్వాలి



ప్రయోగాన్ని శాస్త్రీయ పద్ధతిలో చేయాలి. సెక్షన్ ఏలో వర్గీకరణ శాస్త్రం, సెక్షన్‌–బి లో అంతర్ నిర్మాణ శాస్త్రం, సెక్షన్‌–సీలో లైవ్ ఎక్స్‌పెర్‌మెంట్ పేరుతో ప్రయోగాలు ఉంటాయి. ఒక్కోదానికి ఆరు చొప్పున 18 మార్కులొస్తాయి. నమూనాల పరిశీలనకు ఐదు, రికార్డు రాసినందుకు ఐదు, హెర్బేరియానికి రెండు వెరసి మొత్తం 30 మార్కులుంటాయి.

–చుక్కా సురేష్ కుమార్, బోటనీ అధ్యాపకులు, యండగండి, కె.గంగవరం మండలం

### మూలకాల చర్యలపై అవగాహన ఉండాలి



మూలకాల చర్యలపై అవగాహనతో ప్రయోగాన్ని చేయాలి. లవణ గుణాత్మక విశ్లేషణా విధానానికి 10 మార్కులు, ఘన పరిమాణాత్మక విశ్లేషణా విధానానికి 8, కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్ లేదా కొలైడ్, ఆర్గానిక్ కాంపౌండ్స్, క్రొమెటోగ్రఫీ ద్రావణాలకు 6 మార్కులుంటాయి. రికార్డు, వైవా, ప్రాజెక్టులకు రెండు చొప్పున ఆరు మార్కులుంటాయి.

– వేల్పూరి శ్రీదుర్గా రఘురాం, అధ్యాపకులు, కెమిస్ట్రీ, మండపేట.

### పరికరాలపై అవగాహన అవసరం



ప్రయోగం చేసేటప్పుడు పరికరాలపై అవగాహన ఉండటం ద్వారా విలువలు సరిగ్గా వస్తాయి. ఫిజిక్స్‌లో 20 ప్రయోగాంశాలు ఉంటాయి. వాటిలో ఎంపిక చేసిన ఒక అంశానికి ప్రయోగం చేయడం ద్వారా 21 మార్కులు పొందుతారు. అందులో ఫార్ములాలు, టేబుల్, గ్రాఫ్‌లను వేయాల్సి ఉంటుంది. రికార్డు రాసినందుకు గానూ నాలుగు, వైవాకు ఐదు కలిపి మొత్తం 30 మార్కులుంటాయి.

– బలుసు ధన ప్రసాదరావు, అధ్యాపకులు, భౌతిక శాస్త్రం, నల్లూరు

### పీహెచ్‌సీ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

**కాజులూరు:** మండలంలోని బదనపూడిలో పీహెచ్‌సీ సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు మొకన శ్రీనివాస్, సలాది కృష్ణ తదితరులు కోరుతున్నారు. సోమవారం గ్రామంలో వారు మాట్లాడుతూ బందనపూడి, బందనపూడి శివారు గ్రామాలలో సుమారు మూడు వేల మంది ప్రజలు ఉన్నారన్నారు. గ్రామంలో పీహెచ్‌సీ సబ్‌సెంటర్ లేకపోవటంతో అత్యవసర సమయాల్లో రోగులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఏఎన్ఎం, ఆరోగ్య సిబ్బంది అప్పుడప్పుడూ గ్రామానికి వచ్చి వెళుతుంటారని తెలిపారు. మారుమూల గ్రామమైన బందనపూడికి సరైన రవాణా సదుపాయం సైతం లేకపోవటంతో రోగులను పట్టణాలు, సమీపంలోని ప్రధాన గ్రామమైన గొల్లపాలేనికి చేర్చాలన్నా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పీహెచ్‌సీ సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### భక్తి ప్రపత్తులతో గంధోత్సవం

**రాయవరం:** మండలంలోని పసలపూడిలో నాగూర్ బాబా దర్గాలో 16వ గంధోత్సవాన్ని సోమవారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. దర్గా నిర్వాహకులు ఖాదర్ వలీ బాబా ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక గీతాలాపనల మధ్య గంధపు బిందెలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ముస్లిం సోదరులు దర్గాలో ప్రార్థనలు నిర్వహించి ప్రసాదాన్ని స్వీకరించారు.

## పురస్కార గ్రహీతలకు అభినందనలు



కపిలేశ్వరపురంలో తహసీల్దార్ చిన్నారావును సత్కరిస్తున్న ఉద్యోగులు



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న మండపేట ఎంపీడీవో మూర్తి

**కపిలేశ్వరపురం:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న తహసీల్దార్ కె.చిన్నారావును మండలంలోని పలు శాఖల అధికారులు, ఉద్యోగులు సత్కరించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్న వాకతిప్ప వీఆర్వో జి.ఉమా మహేశ్వరరావును సైతం సత్కరించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు మంచి గుర్తింపు నిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ మండపేట జోన్ అధ్యక్షులు జిత్తుక మల్లిఖార్జునుడు, బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం, మండలంలోని రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్య తదితర శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

**గిరిజాలకు ఆరోసారి ఉత్తమ సేవా పురస్కారం**

**రామచంద్రపురం రూరల్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం 5 సార్లు జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. రామచంద్రపురం మండలం ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో ఈయన సైన్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో అన్ని సైన్స్ ఈవెంట్స్‌ను విజయవంతంగా నిర్వహించి, జిల్లాకు 5 నేషనల్ అవార్డులు వచ్చేందుకు కృషి చేసినందుకు గానూ కలెక్టర్ ఉత్తమ సేవా పురస్కారం అందించి ప్రత్యేకంగా అభినందించారు.

**ఎంపీడీవోకు సేవా పురస్కారం**

**మండపేట:** విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కే సత్యనారాయణమూర్తికి సేవా పురస్కారం లభించింది. రిపబ్లిక్ డే రోజున ఆయన అమలాపురంలో కలెక్టర్ మహేష్‌కుమార్, ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.ఈవోపీఆర్డీ దాసరి శ్రీనివాస్, అర్తమూరు కార్యదర్శి ఎస్ అనిల్‌కుమార్‌లకు వారు చేసిన సేవలకు గుర్తింపుగా సేవా పురస్కారాలు అందజేశారు.

## ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే



ద్రాక్షారామలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్ నాయకులు, సభ్యులు



మండపేటలో థామస్ ఆల్వా ఎడిసన్‌కు నివాళులర్పిస్తున్న ఎలక్ట్రికల్ కార్మికులు



రాయవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్తు, ప్లంబర్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

**మండపేట:** న్యూ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వైరింగ్ అండ్ ప్లంబర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండపేట పట్టణంలో సోమవారం ఎలక్ట్రీషియన్స్ డేను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు నేతృత్వంలో ఆర్కే ఎలక్ట్రికల్ రీవైండింగ్ షాపు వద్ద జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఎలక్ట్రీషియన్ డేను నిర్వహించామన్నారు. థామస్ అల్వా ఎడిసన్ బల్బు కనిపెట్టిన రోజు సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. ఎలక్ట్రికల్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. భవన నిర్మాణ రంగంలో భాగమైన ఎలక్ట్రికల్ పనిని నమ్ముకుని నియోజకవర్గంలో వందలాది మంది కార్మికులు బతుకుతున్నారని అన్నారు. కొన్ని నెలలుగా పనుల్లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని, కార్మికులకు పనిముట్లు, యంత్ర సామగ్రి అందించి అండగా నిలబడాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ల సత్తిబాబు, ఉపాధ్యక్షుడు గుండు వెంకట మురళి, నాయకులు పాల్గొన్నారు.

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని ద్రాక్షారామలో ఎలక్ట్రీషియన్స్ డేను పురస్కరించుకుని శ్రీ భీమేశ్వర ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీ కన్యకా పరమేశ్వరీ సత్రం వద్ద సంఘవి ఎలక్ట్రికల్స్ నేతృత్వంలో విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

**రాయవరం:** రాయవరం మండల విద్యుత్తు, ప్లంబర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ కార్మికుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల రెవెన్యూ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల్లో కార్మికులంతా ర్యాలీ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించిన బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలంటూ రాయవరంలో వివిధ చేతి వృత్తుల కార్మికులకు ర్యాలీలో అవగాహన కల్పించారు.

## బొటానికల్ గార్డెన్ ఏర్పాటు అభినందనీయం

**ఆర్జేడీ శోభారాణి**



గార్డెన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

**మండపేట:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బొటానికల్ గార్డెన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆర్జేడీ శోభారాణి అన్నారు. మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం బొటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పల్లవెంకన్న చారిటబుల్ ట్రస్టు సభ్యులు పల్ల సుబ్రహ్మణ్యం, గ్రామ సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు ముఖ్య అతిథిలుగా హాజరై గార్డెన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ నర్సరీ రంగ పితామహుడు పల్ల వెంకన్న మెమోరియల్ బొటానికల్ గార్డెన్, పల్ల వెంకన్న విజిటర్స్ గార్డెన్లు ఇక్కడ తీర్చిదిద్దామన్నారు. నర్సరీ రంగంలో ఖండాంతర ఖ్యాతి గాంచిన పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ. 2 లక్షల విలువైన మెడిసినల్ ప్లాంట్లు, వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలను ట్రస్టు ద్వారా తమకు అందించడం ఆనంద దాయకమని అన్నారు. ట్రస్ట్ సభ్యులు పల్ల సుబ్రహ్మణ్యం మాట్లాడారు. అధ్యాపకులు మధుకుమార్, అభినయ్, కిరణ్‌కుమార్, ఓ శ్రీనివాసరావు, నెహ్రూనాయక్, గోపాలకృష్ణ, సుందర్‌లు అత్యంత విలువైన మొక్కలను బహూకరించిన ట్రస్టు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పల్ల వీర వెంకట సత్యానారాయణ మూర్తి, పాటంశెట్టి శ్రీనివాస చక్రవర్తి, పల్ల వినయ్ కుమార్, పాటంశెట్టి మైత్రేయ, తాడాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నిక



కపిలేశ్వరపురంలో బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

**కపిలేశ్వరపురం:** బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మండల శాఖ నూతన కమిటీ ఎన్నికైంది. కపిలేశ్వరపురంలో సోమవారం సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల శాఖ గౌరవ అధ్యక్షులుగా కపిలేశ్వరపురం పంచాయతీ కార్యదర్శి కె.శివ చక్రవర్తి, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా డీటీ కె.జానకి రామయ్య, అధ్యక్షుడిగా వాకతిప్ప వీఆర్వో జి.ఉమా మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సర్వశిక్షా అభియాన్ ఎంఐఎస్ టి.సురేష్ ఎన్నికయ్యారు. కమిటీ కార్యకలాపాలు, నియమ నిబంధనలను గుత్తుల వీరబ్రహ్మం వివరించారు. సంఘం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ మండపేట యూనిట్ అధ్యక్షుడు జిత్తుక మల్లిఖార్జునుడు, ఉపాధ్యాయ, ఉద్యోగులు పాల్గొన్నారు.

### సోమేశ్వర స్వామి ఆలయంలో పూజలు

**రాయవరం:** మండలంలోని వెంటూరులో పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో మాస శివ రాత్రి పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి లక్ష మారేడు దళాలతో సోమేశ్వరునికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. యరమాటి రామారావు కుటుంబ సభ్యుల సౌజన్యంతో వేద పండితులు పూజాధికాలు నిర్వహించారు. పార్వతీదేవికి లక్ష కుంకుమార్చనలు, ధూప, దీప, నైవేద్య సేవలు నిర్వహించారు. అనంతరం పూజలకు హాజరైన వారికి అన్న ప్రసాదాన్ని అందజేశారు.

### అనుమానాస్పదంగా యువకుడి మృతి

**రాజోలు:** తాగునీటి చెరువులో పడి తాటిపాక గ్రామానికి చెందిన యువకుడు గుమ్మడి కుమారస్వామి(35) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి మేనమామ సారిక వెంకట శ్రీనివాసరావు రాజోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కుమారస్వామి, అతని తల్లిదండ్రులు వరలక్ష్మి, నాగరాజు ఉపాధి నిమిత్తం హైదరాబాదులో ఉంటున్నారు. ఇటీవల సంక్రాంతి పండగ నిమిత్తం వారు స్వగ్రామం తాటిపాక వచ్చారు. తల్లిదండ్రులు హైదరాబాద్ వెళ్లిపోగా కుమారస్వామి తాటిపాకలోనే ఉండిపోయాడు. అయితే ఈ నెల 25వ తేదీ నుంచి కుమారస్వామి కనిపించడం లేదని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువులో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాల సీజ్

**ఆలమూరు:** జొన్నాడ ఇసుక ర్యాంపులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడు వాహనాలను ఆలమూరు పోలీసులు సీజ్ చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక ఇసుక ర్యాంపులో అనుమతి లేకుండా ఇసుకను తవ్వుతున్నారనే సమాచారంతో ఎస్సై ఎం.అశోక్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఇసుకను తవ్వుతున్న ఆరు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసును కూటమి నాయకులు నీరుగార్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

**ఇసుక మాయం**

జొన్నాడ ఏటిగట్టు సమీపంలో సీజ్ చేసిన ఇసుక గుట్టలు మాయమయ్యాయి. జిల్లా మైన్స్ అధికారులు ఆదేశాల మేరకు గత నెలలో రెవెన్యూ సిబ్బందిని పహరా ఉంచినా ఫలితం లేకపోయింది. సుమారు వంద టన్నుల ఇసుకను అక్రమార్కులు తరలించుకుపోయినట్లు ఈ మేరకు తహసీల్దార్ కె.జె.ప్రకాష్‌బాబు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వానరాల స్వైర విహారం



తణుకువాడలో పంట పొలాల మధ్య సంచరిస్తున్న కోతులు

**భయబ్రాంతులకు గురవుతున్న స్థానికులు**

**కాజులూరు:** మండలంలోని తణుకువాడలో ఇటీవల కోతులు గుంపులు, గుంపులుగా సంచరిస్తూ రైతులను తీవ్రంగా నష్ట పరుస్తున్నాయి. గ్రామ వీధుల్లో హల్‌చల్ చేస్తుంటే స్థానికులు భయ భ్రాంతులకు గురవుతున్నారు. కొబ్బరి చెట్ల నుంచి కాయలు, పిందెలను తుంచి పారవేయడంతో పాటు కూరగాయలు, పూలతోటల పైనా దాడి చేస్తున్నాయని దీంతో తమకు తీవ్రంగా నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. గ్రామ వీధుల్లో సంచరిస్తు ఇళ్లపై పరుగులు తీస్తుండటంతో తాటాకు ఇళ్లు, పెంకు టిల్లుల పైకప్పులు జారి పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు, మహిళలు, ఇంటిలో నుంచి బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులపైనా కోతులు దాడి చేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. తాళ్లరేవు మండలం కోరంగి అభయారణ్యం అతి దగ్గరలో ఉండటంతో అక్కడి నుంచి కోతుల గుంపులు గ్రామానికి చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కోతుల సంచారాన్ని నిరోధించాలని పలువురు రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## కల్లుగీత కార్మికుల నిరసన



రాజోలు ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కల్లుగీత కార్మికులు

**రాజోలు:** రాజోలు నియోజకవర్గంలో కల్లుగీత కార్మికులకు మద్యం షాపు కేటాయించాలని కోరుతూ కల్లుగీత కార్మిక సహకార సంఘ సభ్యులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ప్రొబిహిషన్, ఎక్సైజ్ కార్యాలయం ఎదురుగా ఆందోళన చేపట్టారు. నియోజకవర్గంలోని రాజోలు, మామిడికుదురు, సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లో మొత్తం 36 సొసైటీలు ఉన్నాయన్నారు. కల్లుగీత కార్మికులకు మద్యం షాపులు కేటాయిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం రాజోలు నియోజకవర్గంలో ఒక్క మద్యం షాపు కూడా గీత కార్మిక సంఘాలకు కేటాయించలేదన్నారు. ప్రభుత్వ చర్యల కారణంగా కల్లుగీత కార్మిక సహకార సంఘాలు తీవ్ర నిరాశకు గురయ్యాయని వాపోయారు. రాజోలు నియోజకవర్గంలో మండలానికి ఒక మద్యం షాపును కల్లుగీత కార్మిక సహకార సంఘానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరుకు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ నాయకులు కామన చంద్రరావు, కడలి నాగేశ్వరరావు, పాటి వీర వెంకట సత్యనారాయణ, కాగితపు వెంకటేశ్వరరావు, చప్పిడి రామదాసు, కడలి సాయిబాబు, గుబ్బల కోటేశ్వరరావు, పెచ్చెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.